ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కాకినాడ

జిల్లా వార్తలు

సోమవారం 4 నవంబరు 2024 | 5

డ్రోన్ల వ్యవ'సాయం'



- ఆధునికత వైపు రైతుల అడుగులు
- పొలాల్లో సస్యరక్షణకు వినియోగం
- 6గంటల్లో 30 ఎకరాల పంటపై పిచికారీ
- ఆపరేటింగ్‌లో యువతకు ఉచిత శిక్షణ...

6లో



కలపరు.. వదలరు!

13 ఏళ్లుగా వీడని విలీన వేదన

- 30 గ్రామాల్లో పాలన పడక
- 2011 నుంచి ఎన్నికల్లేవ్
- ప్రత్యేక పాలనతో ఇబ్బందులే
- అందని ఆర్థిక నిధులు
- పన్నులపైనే ఆధారం
- కుంటుపడిన అభివృద్ధి
- కూటమి రాకతో ఆశలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 13 ఏళ్లుగా 'ప్రత్యేక' పాలన.. నేటికీ పంచాయతీల సంగతి అతీగతీ లేదు.. ప్రత్యేకాధి కారులు పట్టించుకోవడం లేదు..పాలక వర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. దీనికి కారణం ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగక ప్రత్యేకాధికారుల పాలనలో ఉండిపోవడమే. పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పొందలేకపోతున్నారు. గ్రామాల్లో ఏ పనులు చేయాలన్నా పన్నులే ఆధారం. దీంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడింది.

మూడుసార్లు ఎన్నికలు జరగలేదు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1103 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పాలకుల్లేని పంచాయతీలు 30 ఉన్నాయి. ఆయా పంచాయతీలు 13 ఏళ్లుగా ప్రత్యేక పాలనలోనే ఉన్నాయి. 2006 ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి.ఆ తర్వాత 2011లో ఎన్నికలు జరగాలి.ఆ 30 పంచాయతీల్లో మాత్రం ఎన్నికలు జరగలేదు. 2011 నుంచి ఆ పంచాయతీల్లో సర్పంచ్, పాలకవర్గాలు లేవు. దీంతో ఈ పంచాయతీల్లో ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయడంలేదు. ఆయా పంచాయతీల్లో ఎన్నికలపై కొనసాగుతున్న సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను తొలగించడం లేదు. దీంతో ఈ గ్రామాల్లో పాలన పడకేసింది. వివిధ శాఖల జిల్లా, మండల అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వార్థ రాజకీయాలకు బలి..

మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్లలో 30 పంచాయతీలను విలీనం చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటుంటే విలీనం చేస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఏంటని ప్రజాప్రతినిధులు, నాయకులు వారి స్వార్థ రాజకీయాల కోసం విలీన ప్రక్రియను అడ్డుకుంటున్నారని విమర్శలున్నాయి. పేరుకే ప్రత్యేకాధికారులైనా అధికార పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ గ్రామాల్లో పాలన సాగుతోంది. దీంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులకు దూరమవుతున్నాయి. అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ప్రజలు చెల్లిస్తున్న పన్నులపైనే అభివృద్ధి పనులు ఆధారపడి ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఎన్నికల సమస్యకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపిస్తారని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తమ గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఎన్నికలు జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఎన్నికలకు దూరమైన పంచాయతీలివే..

కాకినాడ జిల్లా : కాకినాడ రూరల్ మండల పరిధిలో ఆరు పంచాయతీలు. చీడిగ, రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, ఇంద్రపాలెం, తూరంగి. తుని మండల పరిధిలో రేకవానిపాలెం, ఎస్.అన్నవరం, తాళ్లూరు, కుమ్మరిలోవ ఉన్నాయి.

తూర్పు గోదావరి జిల్లా : రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ధవళేశ్వరం, బొమ్మూరు, పిడింగొయ్యి, కోలమూరు, శాటిలైట్ సిటీ, కాతేరు, తొర్రేడు, హుకుంపేట, రాజవోలు, వెంకటనగరం.. రాజానగరం మండలంలో నామవరం, వెలుగుబంద, చక్రద్వారబంధం, పాలచర్ల, దివాన్‌చెరువు. కడియం మండలంలో వేమగిరి, కోరుకొండ మండలంలో గాడాల, నిడిగట్ల, మధురపూడి, బూరుగుపూడి పంచాయతీలు ఉన్నాయి.

'గ్రేటర్' రాజమహేంద్రి ఎప్పుడో

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ రాజమహేంద్రవరం కలగా మారింది. పరిసర గ్రామాల విలీన ప్రక్రియపై అయోమయం నెలకొంది. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థలో రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, రాజానగరం మండలంలోని మొత్తం 22 గ్రామాలతో గ్రేటర్ రాజమహేంద్రవరం చేయాలని 2019కి ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామాలను విలీనం చేసి 54 డివిజన్లతో గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో విలీన ప్రక్రియ మూలనపడింది. కేవలం కొన్ని గ్రామాలనే విలీనం చేసి డివిజన్ల సంఖ్య 54 నుంచి 52కు తగ్గించే ప్రయత్నం చేశారు. అదీ సాగలేదు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు 2015లో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగాయి. మేయర్‌గా పంతం రజనీ శేషసాయి తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆ పాలకవర్గం 2019 జూలై 2న ముగిసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలిచినా ఎన్నికల ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు జరిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. విలీనం గ్రామాలతో కలిపి ఎన్నికలు జరపాలని కొందరు, పాత 50 డివిజన్లతోనే ఎన్నికలు జరిపితే బావుంటుందని కొందరు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కానీ ప్రజలు మాత్రం గతంలో ప్రతిపాదించిన 22 గ్రామాలను కలిపి ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. అలా జరిగితేనే వచ్చే పుష్కరాల నాటికి గ్రేటర్ రాజమహేంద్రవరం కల నెరవేరుతుందనే చర్చ మొదలైంది. ప్రస్తుతం తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రేటర్ కలలు కంటున్నారు. కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు వద్ద పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల విలీనం, ఎన్నికల గురించి ప్రస్తావించినట్టు సమాచారం.



జలాన్ని ఒడిసి పడదాం

- ఉపాధి హామీ పథకంలో.. ఇంకుడు గుంతల నిర్మాణం
- జిల్లాలో 13 మండలాలు ఎంపిక
- 13వేల గుంతల నిర్మాణం టార్గెట్
- ఒక్కో గుంతకు రూ.6వేలు కేటాయింపు



కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటిబొట్టును ఇంకించి భూగర్భ జలాలను పెంచాలనే లక్ష్యంతో అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాల శాతాన్ని పెంచి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడ జిల్లాలో తొలి దశలో 13 మండలాల్లో ఇంకుడు గుంతలు తవ్వాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో ప్రధానంగా గొల్లప్రోలు, పిఠాపురం, కిర్లంపూడి, ఏలేశ్వరం, గండేపల్లి, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, కోటనందూరు. శంఖవరం, తుని, తొండంగి, రౌతులపూడి మండలాలు వున్నాయి. ఈ మండలాల్లో గృహాలతో పాటు రహదారుల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు తవ్వుతారు. ఎక్కడైతే వర్షపు నీరు ఒడిసి పట్టుకోవడానికి ఆస్కారం ఉందో ఆయా ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

భూగర్భ జలాల శాతం పెంచడమే లక్ష్యం

ఈ 13 మండలాల్లో వేసవి కాలంలో భూగర్భ జలాలు బాగా క్షీణిస్తున్నాయి. ఈ కారణంగా సాగుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు పుష్కలంగా లభిస్తే వేసవిలో విత్తే ఆరుతడి పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. పైగా బోర్ల ద్వారా పండించే సూక్ష్మ సేద్యం, బిందు సేద్యానికి కూడా ఎలాంటి నీటి ఇక్కట్లు ఉండవు. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతలను పెద్ద ఎత్తున తవ్వి నీటి ఇక్కట్లు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. సాగునీరు అందకపోవడంతో వేసవిలో కిర్లంపూడి, ఏలేశ్వరం, గండేపల్లి, పెద్దాపురం, ప్రత్తిపాడు, కోటనందూరు, శంఖవరం, తొండంగి, రౌతులపూడి మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయి. తద్వారా అన్నదాతలు తీవ్రంగా తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు చేయాలంటేనే భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల పథకానికి శ్రీకారం చుట్టారు.

డ్రైన్లు లేని ప్రాంతాల్లో అధికంగా నిర్మాణాలు

ఈ మండలాల పరిధిలో ఎక్కడైతే డ్రైన్ల నిర్మాణాలు ఇప్పటి వరకు చేపట్టలేదో ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా గుంతలు తవ్వాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అధికారులు ప్రత్యేకంగా సర్వే చేసి ఆయా ప్రాంతాలను గుర్తించారు.

జనవరికల్లా పూర్తి చేస్తాం

అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ

జిల్లాలో 13వేల ఇంకుడు గుంతలు తవ్వడానికి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేశాం. వచ్చే ఏడాది జనవరికల్లా వీటిని నిర్మిస్తాం. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6వేలు ఇస్తాం. ఆసక్తి ఉన్న గృహాల యజమానులు కూడా అధికారులకు దరఖాస్తు చేసుకుని వీటిని నిర్మించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ముందుకు సాగుతున్నాము.



హాస్టల్ ఆవరణలో వేచి ఉన్న విద్యార్థినులు

RAMYA COLLEGE OF NURSING

ఫీజులుం

- ఫీజు కట్టలేదని రెండో సంవత్సరం విద్యార్థినులపై రమ్య నర్సింగ్ కాలేజీ యాజమాన్యం వేధింపులు
- హాస్టల్లోకి వెళ్లనీయకుండా అడ్డగింత
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్
- స్పందించిన ప్రభుత్వం
- కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో విచారణ చేపట్టిన ఆర్డీవో మల్లిబాబు



కాకినాడ సిటీ/కాకినాడ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో వైసీపీ నేత పితాని అన్నవరానికి చెందిన రమ్య నర్సింగ్ కాలేజీ యాజమాన్యం ఫీజులు కట్టలేదని హాస్టల్‌లోకి వెళ్లనీయకుండా గత రెండు రోజులుగా విద్యార్థినులను పస్తులుంచడంపై దుమారం రేగింది. నర్సింగ్ రెండో సంవత్సరం విద్యార్థినులను యాజమాన్యం తీవ్ర ఇబ్బంది పెడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తున్నా ఫీజు కట్టాలని వేధింపులకు గురిచేసింది. దీంతో తల్లిదండ్రులు భయంతో సగం ఫీజు చెల్లించారు. అయినా పూర్తిగా డబ్బులు కట్టలేదని రెండు రోజులుగా కనీసం భోజనం కూడా పెట్టకపోవడంతో హాస్టల్ విద్యార్థినులు పస్తులున్నారు. బయటకు వెళ్లి తిందామన్నా భయంతో సుమారు 40 మంది ఆకలితో అలమటించారు. పస్తులున్నా నిర్వాహకులు కనికరించలేదు. బయటకు చెప్తే సర్టిఫికెట్లు ఇవ్వమని బెదిరించడంతో విద్యార్థినులు కిమ్మనకుండా ఉండిపోయారు. వీరిలో విశాఖ, ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారు. కాగా నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు తమకు మధ్యాహ్న భోజనం పెట్టడంలేదని నిరసనకు దిగారు. దీనిపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో కథనం ప్రసారమవడంతో ప్రభుత్వం స్పందించింది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర హుటాహుటిన కాలేజీ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. సమస్యలపై విద్యార్థులను ఆరా తీశారు. తాము చెల్లించాల్సిన ఫీజు కన్నా అధిక ఫీజు చెల్లించమని యాజమాన్యం ఒత్తిడి చేసిందన్నారు. ఆదివారం కాలేజీ మూసివేసి భోజనం పెట్టలేదని ఫిర్యాదు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము అందినా విద్యార్థినులు ఫీజు చెల్లించట్లేదని, ఇలాగైతే నిర్వహించడం కష్టమని కాలేజీని మూసివేస్తున్నామని యాజమాన్యం తెలిపినట్టు ఆర్డీవో వెల్లడించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు. అయితే విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చినట్టు ఆర్డీవో చెప్పారు. కాగా రెండు రోజులుగా పస్తులున్న విద్యార్థులకు ఆర్డీవో భోజనాలు అందించే ఏర్పాటు చేశారు.



హాస్టల్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు

ఏళ్ల తరబడి పడుతున్న కష్టాలు తీరనున్నాయి. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రజలతో పాటు విద్యార్థులు, ఆసుపత్రులకు వచ్చే రోగుల ఇబ్బందులు తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే గాక వాటిని ప్రారంభించేందుకు, పనులకు శంకుస్థాపన చేసేందుకు సోమవారం పిఠాపురం నియోజకవర్గానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ రానున్నారు. పిఠాపురంపై పవన్ మార్కు మార్పునకు ఇవే నిదర్శనమని పలువురు చెప్తున్నారు.



సుద్దగడ్డ వరద వస్తే గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారి పరిస్థితి ఇది. ఇక్కడే బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు

అభివృద్ధి పవనాలు

- గొల్లప్రోలు జగనన్న కాలనీ మార్గంలో బ్రిడ్జికి రూ.4కోట్లు మంజూరు
- పిఠాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు ప్రారంభం
- పిఠాపురం పశువుల సంత ఆధునికీకరణ పనులకు శ్రీకారం
- పలు అసంపూర్తి పనులు తిరిగి ప్రారంభం
- అందుబాటులోకి పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు
- తొలిసారిగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొనేందుకు వస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శాసనసభ్యుడి హోదాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తొలిసారిగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, పలు పనుల శంకుస్థాపనల్లో పాలుపంచుకోనున్నారు. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపి మూడు మండలాల పరిధిలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్యలను పరిష్కరించే దిశగా పలు చర్యలు చేపట్టిన ఆయన వాటిని తన చేతులమీదుగా ప్రారంభించనున్నారు. అసంపూర్తి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. డిప్యూటీ సీఎం పర్యటనకు అధికార యంత్రాంగం ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేసింది. భద్రతా కారణాల రీత్యా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పంపిణీలు మండల కేంద్రాల్లోనే ఒకేచోట నిర్వహించనున్నారు.

తీరనున్న జగనన్న కాలనీవాసుల కష్టాలు

గొల్లప్రోలు పట్టణ శివారులో వైసీపీ హయాంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న పేద, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు సరైన మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుద్దగడ్డకు వరదలు వస్తే వారికి కాలనీలోకి వెళ్లే మార్గం లేక పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ ఏడాదిలోనే మూడు నెలల వ్యవధిలో ఏడుసార్లు వరదలు వచ్చి రాకపోకలు నిలిచిపోయాయి. సెప్టెంబరు నెలలో వరదల సమయంలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు రెండు బోట్లు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అదే నెలలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాలనీకి బోటులో వెళ్లి వరద నీటిలో నడుచుకుంటూ కాలనీ వాసులను పరామర్శించారు. కాలనీకి వచ్చే మార్గంలో సుద్దగడ్డ కాలువపై బ్రిడ్జి నిర్మిస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు నెలలు గడవకుండానే డబుల్ లైన్ రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పుడు ఈ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వేసవి ముగిసేలోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.



సూరంపేట బ్రిడ్జి నిర్మాణం పూర్తికి...

ఏలేరు, సుద్దగడ్డ వరదలు వస్తే పట్టణ శివారులోని సూరంపేటకు వెళ్లే మార్గాలు మూసుకుపోతాయి. రైల్వే బ్రిడ్జి కింద నుంచి వెళ్లే మార్గం మూసుకుపోతోంది. వరదల సమయంలో బోటుల ద్వారానే ఇక్కడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వైసీపీ హయాంలో ఊబంద కాలువ (పీబీసీ) కాలువ మీదుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను మధ్యలో నిలిపివేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయం వెళ్లడంతో నిర్మాణం పూర్తికి రూ.24లక్షలు మంజూరయ్యాయి. సగంలో నిలిచిపోయిన పనులకు ఆయన శ్రీకారం చుడతారు.



గొల్లప్రోలు పట్టణ శివారులో అసంపూర్తిగా నిలిచిపోయిన సూరంపేటకు వెళ్లే బ్రిడ్జి

పిఠాపురం నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభించనున్నారు. ఇక్కడ పెచ్చులూడిన పైకప్పులు, శిథిల భవనాల మరమ్మతులకు ఆయన శ్రీకారం చుడతారు. ఎలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గుర్తించిన విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలను పవన్ అందజేయనున్నారు.

ప్రాథమిక పాఠశాలకు సొంత భవనాలు

గొల్లప్రోలు పట్టణంలోని పాపయ్యచావిడి రామకోవెల సమీపంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం.2 భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించి నాడు-నేడు కింద నూతన భవనాలను వైసీపీ హయాంలో నిర్మించారు. అయితే పనులు పూర్తి చేయకపోగా.. ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పించలేదు. పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవడంతో పాఠశాల భవనాలు పూర్తయ్యాయి. ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పించారు. వీటిని పవన్ ప్రారంభించనున్నారు.



గొల్లప్రోలులో ప్రారంభించనున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం.2 భవనం

ఎట్టకేలకు సొంత భవనాల్లోకి డిగ్రీ విద్యార్థులు



పిఠాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన 16ఏళ్ల తర్వాత విద్యార్థులు సొంత భవనాల్లోకి వెళ్లనున్నారు. పాదగయ సమీపంలో ప్రభుత్వ నిధులతో పాటు ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు కలిపి రూ.1.50 కోట్ల వ్యయంతో డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ హయాంలో పనులు పూర్తయినా ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు సమకూరలేదు. ఇప్పుడు వాటిని పవన్ ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లోనే డిగ్రీ కళాశాల కొనసాగింది. దీంతో ఒకపూటే తరగతులు నిర్వహిస్తున్నారు. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తుండడంతో ఇక ఆ ఇబ్బందులు తొలగనున్నాయి.

పశువుల సంత ఆధునికీకరణకు...



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉన్న పిఠాపురం పశువుల సంత ఆధునికీకరణ పనులకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నికలకు ముందు, ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం పిఠాపురంలో నిర్వహించిన సభల్లో పశువుల సంత పనులు చేపడతామని ప్రకటించారు. అన్నట్టుగానే 'కుడా' ద్వారా నిధులు మంజూరు చేయించారు. శిథిలమైన షెడ్లతో సంతకు వచ్చే రైతులు ఇబ్బందిపడుతున్నారు. తాగునీటి సమస్య ఉంది. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఆధునికీకరణ ద్వారా ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం దిశగా అడుగులు పడనున్నాయి. వీటితో పాటు పాఠశాలలు, ఆసుపత్రుల పనులకు, అసంపూర్తి భవనాల పూర్తికి శ్రీకారం చుడతారు.



సైకిళ్లపై శబరిమలైకు..

దేవరపల్లి నుంచి ఇద్దరు స్వాముల యాత్ర

దేవరపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల ఉంటే కానిది లేదు.. లక్ష్యం ఉంటే సాధించలేదని లేదు.. దీక్షగా ఉంటే ఏదైనా చేయవచ్చు.. ఎంత దూరమైనా వెళ్లవచ్చు.. ఇప్పటి వరకూ భవానీ మాలధారులు.. వెంకటేశ్వర స్వామి మాలధారులను చూశాం.. భక్తితో దీక్షగా నడుచు కుంటూ దర్శనం నిమిత్తం బయలుదేరి వెళుతుంటారు.. చూసేవాళ్లకు ఎందుకిలా అనిపించినా..భక్తిలో ఉన్న పవర్ అది..స్వామిని చూడాలి.. భక్తితో మొక్కాలి అదే ఆశ.. అందుకోసం ఎంత శ్రమ అయినా పడతారు.. లక్ష్యం చేరుకుంటారు.. ప్రస్తుతం స్వాములు ఆ దీక్షను ఆచరిస్తున్నారు.. ఎక్కడో 1800 కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరిమలై సైకిళ్లపై వెళుతున్నారు.. గతంలో దివాన్‌చెరువు నుంచి సైకిళ్లపై నలుగురు శబరిమలైకు బయలుదేరి వెళ్లగా తాజాగా ఆదివారం దేవరపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అయ్యప్ప మాల ధారులు కామిశెట్టి వెంకటరమణ, చింతాడ డేవిడ్ శబరిమలైకు సైకిళ్లపై బయలుదేరారు. సైకిళ్లపై వస్తామని స్వామిని మొక్కుకోవడంతో యాత్రకు బయలుదేరినట్టు తెలిపారు. సుమారు 20 రోజులు పడుతుందని తెలిపారు. సైకిళ్లపై శబరి మలై యాత్రకు బయలుదేరిన స్వాము లకు గ్రామస్తులు హారుతులిచ్చి.. ఏ కష్టం లేకుండా క్షేమంగా తిరిగిరావాలని ఘనంగా వీడ్కోలు పలికారు..

డ్రోన్ల వ్యవసాయం!



వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. పాత పద్ధతులను పక్కకు పెట్టి ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు ఇప్పటికే పలు ప్రయోగాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించి పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అమరావతిలో డ్రోన్ల ఎగ్జిబిషన్ నిర్వహించింది. వ్యవసాయంలో డ్రోన్లు రంగ ప్రవేశం పూర్తిస్థాయిలోకి వస్తే కూలీల బెడద తగ్గిపోతుందని,మందుల వృథాను అరికట్టవచ్చని వ్యవసాయాధికారులు అభిప్రాయ పడుతున్నారు. రైతులకు వ్యవసాయానికి డ్రోన్‌లు సహకారమందిస్తున్నాయి..

6 గంటల్లో 30 ఎకరాలకు పిచికారీ

సామర్లకోట/శంఖవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సస్యరక్షణ ఒక ప్రధాన ఘట్టం. ఇందులో కూలీల ఖర్చు భారీగా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉండడం వల్ల రైతులు వ్యవసాయంలో ఇబ్బందుల్లో ఉన్నారు. సస్యరక్షణకు భారీగా ఖర్చు చేసి పెట్టుబడుల భారం కింద నలిగిపోతున్నారు. మరో వైపు కూలీల కొరత వెన్నాడుతోంది. పొలం పనులు చేసే కూలీలు రావడమే గగనంగా మారింది. దీనికి పరిష్కారంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డ్రోన్లు వినియోగించేందుకు పరిశోధనలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర వ్యవసాయాధికారులతో ఇప్పటికే సమాలోచనలు చేపట్టారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు డ్రోన్ల వినియోగంపై పూర్తి పట్టు సాధించే దిశలో కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. కొత్త వంగడాల రూపకల్పనలో, కొత్త వ్యవసాయ పనిముట్ల తయారీలో పేరుగాంచిన సాంకేతిక నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మమేకమవుతూ రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం కింద తక్కువ ఖర్చుతో డ్రోన్లను వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు ప్రయోగాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ శాస్త్రవేత్తల నేతృత్వంలో కీటక విభాగం సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పలు ప్రయోగాలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు అధ్యయనం చేస్తున్నారు.

తక్కువ ఖర్చు..సమయం ఆదా...

డ్రోన్ల టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ క్షేత్రాల్లో కూలీల కొరతను అధిగమించి సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఎకరాకు పురుగుల మందు పిచికారీ చేయడానికి రూ.900 నుంచి రూ.1200 వరకూ ఖర్చవుతుంది. అదే డ్రోనుతో అయితే ఎకరాకు రూ.500 అద్దెగా తీసుకుంటారు. డ్రోన్ వినియోగంతో ఏ సమయంలోనైనా, ఏ పంటకైనా సులభంగా పిచికారీ చేయవచ్చు. తక్కువ ఖర్చుతో అంటే ఒక కూలీకి ఇచ్చే రూ.400తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవచ్చు. డ్రోన్లతో అన్ని రకాల పురుగు, కలుపు మందులు, ఆర్గానిక్ ద్రావణాలు, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేయవచ్చు. కేవలం 6 గంటల్లో 30 ఎకరాల పంటలకు పిచికారీ చేయవచ్చని శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైందని వ్యవసాయ ఉన్నతాధికారులు తెలియజేస్తున్నారు. సాధారణంగా ఎకరా పొలానికి పురుగు మందులు పిచికారీ చేయాలంటే 200 లీటర్ల నీరు అవసరం అవుతుంది. డ్రోన్ ద్వారా కేవలం 10 నుంచి 14 లీటర్లు నీరు మాత్రమే సరిపోతుంది. ఏ పంట మీద అయినా సరే 2-3 అడుగుల ఎత్తులో పొలమంతా సమానంగా పిచికారీ చేయడం డ్రోన్‌లతోనే సాధ్యమని వెల్లడైంది. పిచికారీలో 95 శాతం నీటిని, 95 శాతం సమయాన్ని, 25-40 శాతం మందు ద్రావణాన్ని ఆదా చేస్తూ తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని రుజువైంది. మందు మోతాదు 4వ వంతు తగ్గడం వల్ల పర్యావరణానికి కలిగే కాలుష్యాన్ని నివారించవచ్చు.వరి పంటలో సుడిదోమ లాంటి మొండి పురుగులను డ్రోన్ పిచికారీ ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పురుగు మం దులు వాడకం ద్వారా రైతుల్లో వచ్చే అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాల నుంచి తప్పించవచ్చు.

- మారుతున్న అగ్రి..కల్చరల్!!
- ఆధునికత వైపు అడుగులు
- సాగులో నూతన ఒరవడి
- సస్యరక్షణకు డ్రోన్లు
- పెరుగుతున్న వినియోగం
- ఒక్క క్లిక్‌తో పంటకు రక్షణ
- కూటమి ప్రభుత్వ సహకారం
- డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

పనిచేస్తుందిలా..

జీపీఎస్, ఆటో పైలెట్ సహాయంతో రిమోట్ ద్వారా లేదా ఎల్‌సీడీ మొబైల్‌లో అగ్రిమీట్, అగ్రి అసిస్టెంట్ యాప్ ద్వారా ముందుగా పొలంపైన సెట్ చేసిన ఎత్తులో నిర్దిష్టమైన దిశలో పిచికారీ చేసేలా డ్రోన్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడి స్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో స్థాయిని బట్టి ఒక డ్రోన్ ధర రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షల వర కూ అందుబాటులో ఉన్నాయి. 12-16 వేల ఎంఏహెచ్ లిథియం పాలిమార్ బ్యాటరీతో 10 లీటర్ల డ్రమ్ము, ఒక జత బ్యాటరీస్‌తో ఒక ఎకరానికి కేవలం 10 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయవ చ్చు. సిగ్నల్ పోయినా, మందు అయిపో యినా, బ్యాటరీ తగ్గిపోయినా, పిచికారీ పూర్తయినా, డ్రోన్ మొదట ఉన్న చోటికే తిరిగి వస్తుంది. డ్రోన్ ద్వారా పిచికారీ పూర్తి చేసినదీ, ఇంకా చేయాల్సిందీ, చేస్తున్న ప్రదేశాన్ని మొబైల్ యాప్‌లో ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో చూడవచ్చు. దీన్ని సులభంగా వినియోగించడానికి వీలుగా ఒక పైలెట్(ఆపరేట్ చేయడానికి ల్యాండింగ్, డ్రోన్ తప్పిపోకుండా శాస్త్రీయ శిక్షణ పొందిన వ్యక్తి) రీచార్జి చేస్తూ, బ్యాటరీలు మార్చడానికి ఒక వ్యక్తి, మ్యాపింగ్ చేసేందుకు ఒక వ్యక్తి అవసరం ఉంటుంది. దీన్ని ఉపయోగించే వ్యక్తికి ప్రభుత్వ క్లియరెన్సుతో పాటు డీజీసీఏ వారి నుంచి అనుమతి పత్రం తప్పనిసరి.

యువతకు శిక్షణ



డ్రోన్ల వినియోగంపై యువతకు రాష్ట్రప్రభు త్వం శిక్షణ ఇస్తోంది. వ్యవసాయశాఖ ద్వారా ఎంపికైన యువతకు గుంటూరు విశ్వవిద్యాలయంలో డ్రోన్ల పైలట్‌ల శిక్షణ ఇస్తుంది. డ్రోన్ వినియోగం ఏ పంటకు ఎలా ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయాలి, డ్రోన్ విడిభాగాలను ఎలా అమర్చాలి అనేదానిపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తోంది. శిక్షణ తీసుకున్న యువతకు సబ్సిడీలో డ్రోన్లు అందిం చేందకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

డ్రోన్ల వినియోగం పెరిగింది



సాంకేతికత పెరగడంతో డ్రోన్ కెమెరాలను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. తాము ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు శిక్షణ పొందుతున్నాం. ప్రస్తుతం ప్రతి దాంట్లో డ్రోన్ల వినియోగం పెరిగింది. ఇది ఫొటోగ్రాఫర్లకు శుభపరిణామం.

- రాము సూరిబాబు, డ్రోన్ కెమెరామెన్

రైతుకు ఆదా అవుతుంది



వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుంది. దీంతో రైతులకు కూలీల బెడద తగ్గుతుంది. సమయం, సొమ్ములు ఆదా అవుతాయి. ప్రభుత్వం కూడా డ్రోన్‌ల వినియోగం వ్యవసాయంలో పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటుంది.

- రత్నప్రశాంతి, ఏడీఏ, కాకినాడ

వ్యవసాయానికి పూర్వవైభవం



వ్యవసాయంలో పూర్వవైభవానికి డ్రోన్‌లు ఉపయోగపడతాయి. పంటలపై ఎరువులు, పురుగుమందులు చల్లేందుకు హైబ్రిడ్ డ్రోన్‌లు ఉపయోగపడుతున్నాయి. ఆరు లీటర్ల పెట్రోల్‌తో 16 లీటర్ల పురుగుమందు పిచికారీ చేస్తుండడం విశేషం.

- బీవీ.సత్యనారాయణ, రైతు వెంకటకృష్ణరాయపురం, సామర్లకోట





అయ్యప్ప పడిపూజకు ఏర్పాటు చేసిన సన్నిదానం వేదిక. పక్క చిత్రంలో పూజలు జరిగే ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడులో నేడు కోటి బిల్వార్చన

25వేల మంది అయ్యప్ప భక్తులతో పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని మినర్వా కళాశాల సమీపంలో సోమవారం జరిపే అయ్యప్పస్వామి లక్ష దీపోత్సవాల మధ్య కోటి బిల్వార్చనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేరళలోని అయ్యప్ప స్వామి ఆలయం మాదిరిగా 8 ఎకరాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం లక్ష్మి గణపతి హోమంతో కోటి బిల్వార్చన పూజలు ప్రారంభం కానున్నాయి. చండీహోమం, పూర్ణాహుతి, గురు పూజోత్సవం, సాయంత్రం ప్రత్తిపాడులో అయ్యప్పస్వామి ఊరేగింపు, అయ్యప్ప పడిపూజ, 6గంటల నుంచి కోటి బిల్వార్చన పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజల నిమిత్తం శబరిమల సన్నిదానం నుంచి పందల రాజ్యవంశీకులు ఆలయ పూజారి మేల్ శాస్త్రి, స్వామిజీలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. ఇరవై అయిదు వేల మంది అయ్యప్ప భక్తులు, మరో 10 వేల మంది ప్రజలు పాల్గొనేలా మైదానాన్ని బారికేడ్లతో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 400 మంది మహిళా వలంటీర్లు, 200 మంది పురుష వలంటీర్లను ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి కోటి బిల్వార్చన పూజలు నిర్వహించే ప్రాంగణాన్ని ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు. పూజలు నిర్వహించే యాగశాలలు, సన్నిదాన ప్రదేశాలు పరిశీలించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.





కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదసభ

వేదాలు..సమస్త ధర్మాలకు మూలం

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో హోరెత్తిన వేదసభ

కొవ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేదాలు సమస్త ధర్మాలకు మూలమని, వేదస్వస్తి చేయడం వల్ల లోకమంతా సుభిక్షంగా ఉంటుందని గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి అన్నారు. ఆదివారం కొవ్వూరు గోష్పాదక్షేత్ర వేదశాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని నిరంజన ధర్మజ్ఞాన కళావేదికలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) సహకారంతో వేద సభ జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు వేద పఠనం చేశారు. వేద మంత్రోచ్చరణ చేస్తూ వేదస్వస్తి పలికారు. వేదశాస్త్ర పండితులు మాట్లాడుతూ కొవ్వూరు ఆధ్యాత్మిక కేంద్రమని, వేదసభలు అంతటా నిర్వహించాలన్నారు. గోష్పాదక్షేత్రంలో నిరంతరం ధర్మకార్యాలు జరుగుతుంటాయన్నారు. కార్యక్రమంలో నోరి భోగేశ్వరశర్మ, విశ్వనాధ గోపాలకృష్ణ శాస్త్రి, దువ్వూరి ఫణి సోమయాజులు, గుళ్ళపల్లి శర్మ, దోర్బల ప్రభాకరశర్మ, కలిగొట్ల కృష్ణారావు, చామర్తి రమా సత్యనారాయణ శాస్త్రి, పి.మురళీ కృష్ణ తదితరులతో పాటు 150 మంది రుత్వికులు, ఘనాపాటీలు, క్రమపాటీలు, వేదశాస్త్ర పండితులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ

అన్నవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు అంత్రాలయ దర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. ఆదివారం ఒక్కరోజు 4,190 వ్రతాలు జరగ్గా, పలు విభాగాల ద్వారా సుమారు రూ.50లక్షల ఆదాయం లభించింది.

మొదటి కార్తీక సోమవారం ప్రత్యేక ఏర్పాట్లు: మొదటి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించాలని ఈవో సర్క్యులర్ జారీచేశారు. సత్రం గదులు దొరకని భక్తులకు విష్ణుసదన్ హాల్స్‌లో ఉచిత వసతి ఏర్పాటు చేసి భక్తులను ప్రత్యేక వాహనాల ద్వారా ఉచిత రవాణాసౌకర్యం కల్పించారు.

రత్నగిరిపై ఉప లోకాయుక్త పూజలు



సత్యదేవుని సన్నిధిలో ఉప లోకాయుక్త రజని

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజనీ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



అనవసర పోస్టులు పెడితే కేసులే..

- పోస్టుపెడితే చిక్కినట్టే
- కేసుల నమోదుకు ఐజీ ఆదేశం
- సీఎంపై అసభ్యకర పోస్టు
- ఒకరిపై ఆదివారం కేసు
- 610 నోటీసులు జారీ
- సైబర్ ల్యాబ్‌లో నిఘా
- లాఠీ తీసిన కూటమి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సహనానికి హద్దు ఉంటుందంటారు. హద్దు మీరితే బుద్ధి చెప్పక తప్పని పరిస్థితులు వస్తాయంటారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ పనే మొదలు పెట్టింది. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా కొందరు రెచ్చిపోతున్నారు. వైసీపీ ప్రోద్బలంతో ఎన్‌డీఏ కూటమిపై..ప్రధానంగా టీడీపీ పైన, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విషం కక్కిస్తోంది.



కొన్ని పోస్టులు మరీ అసభ్యకరంగా, సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉంటున్నాయి.ఈ దాష్టీకం ఐదేళ్ల నుంచీ ఉన్నా ఇంకా కొనసాగుతూనే ఉంది.దీంతో కూటమి ప్రభుత్వం తన హెచ్చరికలను ఆచరణ లోకి తీసు కురాక తప్పడంలేదు.ఈ క్రమంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదివారం జిల్లా పోలీసులతో జరిపిన సమావేశం వాడివేడిగా సాగి ంది. సైబర్ క్రైం, సోషల్ మీడియాపై చర్చ జరిగింది.

అదే అలవాటు..

గత ఐదేళ్లలో వైసీపీ మూకలు టీడీపీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితరులపై పలు రకాల అభ్యంతర పోస్టులతో చెలరేగి పోయారు. ప్రధానంగా ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్, ఇన్‌స్టా ఇలా అందుబాటులో ఉన్న అన్ని ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియా కూడా సిగ్గుపడేలా ఎన్నో పోస్టులు పెట్టేవారు. తమపై వైసీపీ నాయకులు దారుణంగా పోస్టులు పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా వారినే కేసులో ఇరికించేవారు. అప్పటి సీఎం హోదాలో జగన్ కూడా వాళ్లను అన్ని విధాలుగా ప్రోత్సహించారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారమిచ్చారు. దీంతో వక్ర మార్గాన్ని విడనాడాలని, ప్రజలకు మేలు చేయ డంలో కలిసి రావాలని కూటమి నేతలు పదేపదే చెప్పుకుంటూ వచ్చారు. కానీ ఫలితం లేకపోయింది. సుమారు నాలుగు నెలల పాటు సీఎం చంద్రబాబు సహనం, ఓర్పు వహించారు.మరోవైపు వైసీపీ వాళ్ల బరితెగింపు అంతకంతకూ మితిమీరిపోతోంది. దీంతో బెండు తీయాల్సిందేనంటూ పోలీసులకు ఆదేశాలిచ్చారు.

ఇక కటకటాలే..

నాలుగు నెలలపాటు సహనం వహించిన కూటమి ప్రభుత్వం..ఇక బుద్ధి చెప్పండని ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నిపుణులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఏలూరు రేంజ్ ఐజీ జిల్లా పోలీసులతో సమీక్ష చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్‌తో సహ అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైం, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై సుదీర్ఘంగా సమావేశం జరిగింది. ఇకపై ఉపేక్షించవద్దని, కేసులు బనాయించి దర్యాప్తు చేయాలని ఐజీ ఆదేశించారు. ఫేక్ ఐడీలపై దృష్టిసారించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. దీంతో సోషల్ మీడియాను నిరంతరం నిశితంగా గమనిస్తున్నారు. వేరేచోట్ల పెట్టిన పోస్టుల విషయంలో అక్కడ పోలీస్ సైబర్ ల్యాబ్ లో కూడా ప్రయత్నిస్తున్నారు. సెలవులు, సమయం వంటివి పక్కన పెట్టి సైబర్ ల్యాబ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి రాజకీయ పార్టీల మధ్య వివాదాలు చెలరేగే విధంగా అసభ్యకర పోస్టు పెట్టారంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు 'చందు వైఎస్ఆర్‌సీపీ' ఫేస్‌బుక్ ఐడీ అడ్మిన్ వీరాబత్తుల చంద్రశేఖర్(వడిశలేరు)పై ఆదివారం సాయంత్రం ఎఫ్ఐఆర్ వేశారు. డీజీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో ప్రాథమిక దర్యాప్తు అనంతరం పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఇప్పటికే సోషల్ మీడియాలో అకౌంట్లు ఉన్న జిల్లాలోని పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ఇతర సంఘాలు, వ్యక్తులకు 610 నోటీసులు ఇచ్చారు. ఏ ఐడీ నుంచి అసభ్యకర, ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు వచ్చినా ఆ ఐడీ అడ్మిన్‌పై కేసు తప్పదని హెచ్చరించారు. తమ వద్ద ఉన్న సాంకేతికతను ఉపయోగించుకొని ఫేక్ ఐడీలతో లేదా ఇతర మతలబులు చేసినా పట్టేస్తామని స్పష్టం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా జిల్లాలో వైసీపీ అనుకూల ఖాకీలు కీలకస్థానాల్లో కూర్చోవడంతో ఆయా కేసుల్లో దర్యాప్తు నీరుగారే ప్రమాదం లేకపోలేదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల తయారీకి పాల్పడిన డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్


డిప్యూటీ తహసీల్దార్ శశిధర్

అనపర్తి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ముందు అనపర్తిలో వెలుగుచూసిన నకిలీ ఇళ్ల పట్టాల తయారీలో అప్పటి డిప్యూటీ తహశీల్దార్, ప్రస్తుత పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. అనపర్తి మండలంలో భూసేకరణలో రైతులకు సొమ్ములు చెల్లించకుండా ఎటువంటి హద్దులు లేకుండా తహశీల్దార్ కార్యాలయంలో పట్టాలు తయారుచేసి పంపిణీకి సిద్ధం చేశారు. దీంతో అప్పటి ప్రతిపక్ష నాయకుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డివిషయాన్ని బయట పెట్టారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ తహశీల్దార్ శశిధర్‌ను రంగంపేటకు బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గతనెల 7న డిప్యూటీ కలెక్టర్ స్వామినాయుడు అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దాని ఆధారంగా శశిధర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల తాకిడి


పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

వీఆర్‌పురం/దేవీపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు, పేరంటాలపల్లి పర్యాటక ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంది. గతవారం రోజులక్రితం పాపికొండల విహారయాత్రను ప్రారంభించారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. దీంతో పోచవరం ఫెర్రీ పాయింట్ దగ్గర పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. సుమారు 550మంది పర్యాటకులతో ఆరు బోట్లలో పాపికొండలకు, పేరంటా లపల్లిలో శివాలయంలో శివుడిని దర్శించుకున్నారు. ప్రకృతి అందాలను, గలగలా పారే సెలయేరులను చూసేందుకు పర్యాటకులు ఎగబడ్డారు.

మత్స్యకారులకు నష్టపరిహారం

- రూ.149.99కోట్లు ఇచ్చేందుకు ఓఎన్జీసీ అంగీకారం
- 21న లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఓఎన్జీసీ రూ.149.99 కోట్లు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించినట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఆదివారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో సముద్రంలో ఓఎన్జీసీ పైప్‌లైన్ల కార్యకలాపాలవల్ల మత్స్యకారుల చేపల వేటకు అవరోధం ఏర్పడింది. ఉపాధి లేక మత్స్యకార కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పలుమార్లు ఓఎన్జీసీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జనవరి 29నుంచి జూలై 17వరకు రోజుకు రూ.460వంతున చెల్లించేందుకు ఓఎన్జీసీ అంగీకరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 23,458 మందికి ఒక్కొక్కరికీ రూ.63,943 వంతున రూ.149.99కోట్లు విడుదల కానున్నట్లు తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఎక్కువ మంది మత్స్యకారులకు నష్టం జరిగిందన్నారు. నాలుగు మండలాలకు చెందిన 20,878మందికి రూ.133.51కోట్లు పరిహారం అందనున్నట్లు తెలిపారు. ఈనెల 21 మత్స్యకార దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిధులు విడుదలవుతాయన్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తారన్నారు. ఓఎన్జీసీ ఇచ్చే సొమ్మును తమ ప్రభుత్వం ఇస్తున్నట్లుగా గతంలో వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు నాగిడి నాగేశ్వరరావు, దండుప్రోలు సత్యం, వాద్రేవు వీరబాబు, అర్దాని శ్రీను, సంగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి యూపీఈఐఎఫ్ మద్దతు

- ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్సీ చిరంజీవి
- పాల్గొన్న ఎమ్మెల్యేలు కొండబాబు, చినరాజప్ప, నానాజీ



ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి మద్దతు తెలుపుతున్న యూపీఈఐఎఫ్ నాయకులు

కాకినాడ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తరఫున బరిలో ఉన్న ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) మద్దతు తెలిపింది. కాకినాడ సాంబమూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సంఘ కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి బేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వి.చిరంజీవి, విశిష్ట అతిథులుగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎన్.పూర్ణచంద్రరావు, ఫెడరేషన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపకులు ఎం.శ్రీవిజయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలలు నరకం చూశాయని రకరకాల జీవోలతో రాష్ట్రవ్యాప్తంగా చిన్న పాఠశాలలు మూతపడ్డాయన్నారు. గత ప్రభుత్వంమీద 54 కేసులు హైకోర్టులో వేశామని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ తరఫున రాజశేఖరం గెలుపు పూర్తిగా మద్దతును తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలను పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారులపై ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 6వ తేదీతో ఓటరు నమోదు ప్రక్రియ ముగుస్తుందని ఈలోపు ప్రైవేట్ విద్యాసంస్థల సహకారంతో నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. ఫార్మసీ కళాశాలల అధ్యక్షులు కనకరాజు, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నారాయణరావు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఎమ్మెల్సీ చిరంజీవిని, అభ్యర్థి రాజశేఖరంను ఫెడరేషన్‌తరఫున సత్కరించారు.

ఉండ్రాజవరంలో ఏకాదశ సహస్ర గళార్చన

ఉండ్రాజవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెరవలి మండలానికి చెందిన హిందూ ధర్మ పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ఆదివారం ఏకాదశ సహస్ర గళార్చన, హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1008మంది చిన్నారులతో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అనంతరం జ్యోశ్యుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆంజనేయస్వామి అష్టోత్తర పూజ జరిపారు. కార్యక్రమ సమన్వయకర్త సీహెచ్‌ఎస్ నాగభూషణం మాట్లాడుతూ నేటితరం చిన్నారులకు సనాతన సంప్రదాయాలను పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సుంకవల్లి సూర్యానారాయణ, జీవీ సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, సుంకవల్లి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పులి జాడేది?



- దారితప్పుతున్న అటవీ అధికారుల అన్వేషణ
- అధికారుల కెమెరాలకు చిక్కని మన్యం పులి
- 20 రోజులు దాటినా కనపడని పులిజాడ
- భయం గుప్పెట్లో గిరిజనులు

కూనవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎక్కడ నుంచి వచ్చిందేమోగానీ పులి సంచారం ఇక్కడ మన్యం ప్రజల గిరిజనులను భయం వెంటాడుతూనే ఉంది. సరిగ్గా గతనెల 15వ తేదీన దూగుట్టలో పులి పాదముద్రలు కనిపించడంతో మండలంలోని మన్యంలో పులి అలజడి మొదలైంది. ఇప్పటికే నాలుగు పశువులను వేటాడి చంపింది. పులి ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కానీ అటవీ అధికారులకు మాత్రం తాము ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కడంలేదని ఫారెస్టు అధికారులు అంటున్నారు. పులిజాడ కోసం ఇప్పటికే 30కిపైగా ట్రాప్ కెమెరాలు అడవిలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేశారు. ఒక్క కెమెరాలోను పులి జాడ కనిపించడంలేదంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పొలాల్లోకి వెళ్లి వ్యవసాయం చేయాలంటేనే గిరిజన ప్రాంతాల్లో కూలీలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. గిరిజనుల భూములు సాధారణంగా అడవుల్లోనేఉంటాయి. వ్యవసాయం అక్కడే సాగు చేస్తారు. ప్రస్తుతం వరి, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. అటవీ ప్రాంతం దగ్గరలో ఉన్న బోదునూరు, మెట్ట రామవరం, పాలగూడెంతోపాటు వలస గ్రామాలైన రామచంద్రాపురం, కన్నాపురం గ్రామాలు సాయంత్రం 6 దాటితేనే నిశబ్దంగా మారుతున్నాయి. పగటిపూట వ్యవసాయ పనులకు వెళితే పులి వచ్చి ఎక్కడ మీద పడుతుందోనని భయానికి గురవుతున్నట్లు గిరిజనులు తెలుపుతున్నారు.

పులి భయంతో నిద్రపట్టడంలేదు



- కుంజం అనిల్

పులి భయంతో గిరిజన గ్రామాల్లో ప్రజలకు నిద్రపట్టడంలేదు. ముఖ్యంగా పట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అడవుల్లోకి వెళ్లలేక పట్టుసాగు చేయలేకపోతున్నారు. పశువులను మేపడానికి కూడాగిరిజనులు అడవిలోకి వెళ్లలేక పోతున్నారు. పులికి భద్రత కల్పించి ఇక్కడి నుంచి దట్టమైన అడవుల్లోకి తరలించే ఏర్పాట్లు అటవీ శాఖాధికారులు చేయాలి. లేకపోతే గందరగోళం భయంతో గిరిజనులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి

- నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్
- మృతులు అనంతపురం జిల్లా వాసులు
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన


పుల్లలపాడు వద్ద లారీలోకి దూసుకుపోయిన కారు


ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ(ఫైల్)


చికిత్స పొందుతున్న డ్రైవర్ సాకే సూర్యనారాయణ

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ ఢీ కొనడంతో అక్కా చెల్లెళ్ళు మృతి చెందగా డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంనకు చెందిన అనంతపురంలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చెందిన కనకదుర్గ (84) వివాహం కాలేదు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. రాజేశ్వరికి కూడా వివాహం కాలేదు. అనంతపురంలోని శారదా కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. మూడునెలలకు ఒకసారి వెళ్లి అద్దె సొమ్ములను వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి వారివద్ద డ్రైవర్‌గా పనిచేసే అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ (45) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు కారులో వీరిద్దరు బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు పక్కన పెట్టి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. దీంతో దానిని గమనించక డ్రైవర్ కారుతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడి కక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన రాజేశ్వరి, సూర్య నారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల ను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య


నిమ్మలపూడి సత్యసాయి (ఫైల్)

రంగంపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం కోటపాడులో ఓ యువకుడు శరీరానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తోట కృష్ణసాయి వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం పి.నాయకంపల్లికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి(22) ఇంటర్ పూర్తిచేసి తన అన్నయ్య నిమ్మలపూడి సాయికృష్ణతో కలిసి కోటపాడు పరిధిలో కోళ్లఫారం నిర్వహిస్తున్నారు. సత్యసాయి గతనెల 12న స్వామి అయ్యప్ప మాల ధరించాడు. స్నేహితులతోనే కలిసి పూజ నిర్వహించాడు. 30న స్నేహితుడైన రాజేష్ క్రెడిట్ కార్డు ద్వారా పెట్రోల్ కొట్టించుకున్నాడు. క్రెడిట్ కార్డు తీసిన విషయం రాజేష్‌కు తెలియదు. ఒకవేళ కార్డు విషయం తెలుసుకొని రాజేష్ తనని అడుగుతాడేమోననే భయంతో మనస్థాపానికిలోనై అక్టోబరు 31న ఉదయం 4గంటలకు ఇంట్లో పూజ ఉందని చెప్పి వెళ్లి కోటపాడులోని సుకృతి లేఔట్‌లో నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియని బంధువులు అతని జాడ కోసం మూడు రోజుల నుంచి వెతుకుతున్నారు. ఈ క్రమంలో సుకృతి లేఔట్‌లో ఈనెల 2న కాలిన గాయాలతో మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుడి అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతిపై పలు అనుమానాలు

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకంపల్లి గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురి వివరాల ప్రకారం గత 3 రోజుల కిందట సత్యసాయి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతను కనిపించకపోవడంతో కుటుంబీకుల్లో అలజడి మొదలైంది. సత్యసాయి మృతదేహం శనివారం ఉదయం రామేశ్వరంపేట-కోటపాడు మధ్యలో ఉన్న లేఅవుట్‌లో లభించింది. అతడి మోటారుసైకిల్ రంగంపేట వెళ్లే దారిలో బీరుఫ్యాక్టరీ సమీపంలో పార్కు చేసి ఉంది. మృతదేహానికి, బండికి కిలోమీటరు దూరం ఉంది. అయితే ఒంటికి నిప్పుపెట్టుకున్నప్పటికీ కాలిపోయిన గాయాలుండడంతో సత్యసాయి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య



కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోల్పోయానని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... మండల పరిధి అవిడి గ్రామానికి చెందిన దువ్వ చంద్రశేఖర్(43) అవిడి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేసుకుంటూ ఉండేవాడు. 2023లో అతనిని విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి స్థానిక నాయకులు, అధికారులను కలిసి తనకు గతంలో మాదిరిగానే ఉపాధి కల్పించాలని కోరుతున్నాడు. అయినప్పటికీ ఎవ్వరూ తనకు అవకాశం కల్పించడంలేదని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో శనివారం ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇతని కుమారుడు దువ్వ ప్రవీణ్ చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన వీధి శ్రీనివాసరావు, నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకకు చెందిన వీధి శ్రీనివాసరావు(46)అరటి గెలలు మోటార్‌సైకిల్‌పై మార్కెట్‌యార్డుకు తెచ్చి అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రావులపాలెం మండలం లక్ష్మిపోలవరం లంక పొలాల నుంచి రావులపాలెం అరటి మార్కెట్‌యార్డుకు మోటార్‌సైకిల్‌పై లోడు తెచ్చేందుకు బయలుదేరాడు. ఆ సమయంలో లక్ష్మిపోలవరం వద్దకు వచ్చే సరికి వేగంగా పొడగట్లపల్లి వైపు వెళుతున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు మృతిని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వారితో చర్చలు జరిపి అనంతరం మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరించిన్నట్లు పోలీసులు తెలిపారు.

మాకు దిక్కెవరూ....

పనికోసం వెళ్లిన తన భర్త ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త విన్న మృతుడి భార్య, కుమార్తె మాకు దిక్కెవరంటూ రోధిస్తున్న తీరు అందర్నీ కలిచివేసింది. మృతిచెందిన వీధి శ్రీనివాసరావుకు భార్య ధనలక్ష్మి, కుమార్డు వీరబాబు, కుమార్తె ఉండగా కుమార్డు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. కుమార్తె రాజానగరం కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతుంది. అప్పుడు కుమార్డు, ఇప్పుడు భర్త మృతి చెందడంతో ఆ తల్లీకూతురు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉచిత గ్యాస్ పథకానికి

విభజన చిక్కుముడి

- ఇంకా తెలంగాణ పేరిట గ్యాస్ కనెక్షన్లు
- అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది గ్యాస్ వినియోగదారులు
- పదేళ్లు అవుతున్నా ఆంధ్రాకు బదిలీ చేయని కనెక్షన్లు


తోటపల్లిలోని గ్యాస్ ఏజెన్సీ పాయింట్

ఎటపాక, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విభజన, విలీన మండలాలు ఆంధ్రాలో విలీనం జరిగి దాదాపు పదేళ్లు దాటుతున్నా... విలీన వాసులకు ఇంకా విభజన సమస్యలు తొలగడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా మహిళల కోసం ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి విలీనవాసులు దూరమవుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి ఎటపాక మండలంలో తోటపల్లి, సీతాపురం, నెల్లిపాక, రాయనపేట, నందిగామ, తదితర గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులు ముందుగా గ్యాస్ బుకింగ్ చేసుకుని, ఉచిత గ్యాస్ పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ విలువ నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్‌ను కొనుగోలు చేసుకొంటున్నారు. గ్యాస్ నగదు 48 గంటల్లో ఖాతాల్లో జమవుతుందని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడంతో అనేక మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకుంటున్నారు. అయితే 48 గంటలు దాటినా వారి వారి బ్యాంకుఖాతాల్లో ఉచిత గ్యాస్‌కు సంబంధించిన నగదు జమకాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చుట్టూ తిరుగుతున్నారు. చివరకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మీ గ్యాస్ కనెక్షన్లు ఇంకా తెలంగాణ (భద్రాచలం)లో నమోదు ఉన్నాయని, అందుకే నగదు జమకావడంలేదని చెప్పడంతో గ్యాస్ వినియో గదారులు కంగుతింటున్నారు.

ఇంకా తెలంగాణ పేరిట నమోదై ఉన్న కనెక్షన్లు

రాష్ట్రం విడిపోయి దాదాపు పదేళ్లు దాటుతున్నా, విలీన మండలాల గ్రామాలకు చెందిన గ్యాస్ వినియోగదారుల గ్యాస్ కనెక్షన్ల ఇంకా తెలంగాణలోని భద్రాచలం (హెచ్‌పీ గ్యాస్) పేరిట నమోదై ఉండడం, అక్కడి గ్యాస్ సంస్థ ప్రతినిధులు నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తోంది. పదేళ్లు దాటుతున్నా భద్రాద్రి హెచ్‌పీ గ్యాస్ సంస్థ ప్రతినిధులు ఆంధ్ర గ్యాస్ వినియోగదారుల కనెక్షన్లను ఆంధ్ర పరిధిలోకి బదిలీ చేయడానికి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇన్నాళ్లు సాంకేతిక సమస్య సాకు చూపిస్తూ బదిలీ ప్రక్రియను నిలిపివేశారనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ పేరిట నమోదై ఉన్న గ్యాస్ వినియోగదారులు ప్రతీ గ్రామంలో 20, 30మంది వరకు ఉన్నట్లు ప్రాథమిక అంచనాగా తెలుస్తోంది. వీరిలో కొందరు మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం గ్యాస్ ఏజెన్సీలవద్ద సిలిండర్‌ను పొందుతున్నారు. సిలి ండర్ పొంది రెండు రోజులు గడుస్తున్నా నగదు జమవకపోవడంతో వినియోగదారులు లబోదిబో మంటున్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం ఈ సమస్యపై తెలంగాణలోని భద్రాచలం లేక మారేడుమిల్లి వెళ్లాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. దాంతో గ్యాస్ వినియోగదారులు ఏం చేయాలో తెలిక అయోమయానికి గురవుతున్నారు.

అర్హత కోల్పోతున్న ఆరేడు వేల మంది వినియోగదారులు

తెలంగాణలో గ్యాస్ కనెక్షన్లు నమోదై ఉండడంతో ప్రభుత్వం అందించే ఉచిత సిలిండర్ పథకానికి మండలంలో ఆరేడు వేలమంది వినియోగదారులు అర్హత కోల్పోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం అందించే పథకానికి వీరు అర్హులైన భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పథకానికి దూరమవుతున్నారనే విమర్శలు వెలువడుతున్నారు. గత ఐదారు రోజుల నుంచి చాలామంది వినియోగదారులు ముందుగా నగదు చెల్లించి, గ్యాస్ సిలిండర్ పొందుతున్నారు.తర్వాత రెండు రోజులు గడుస్తున్నా అకౌంట్‌లో నగదు జమకాకపోవ డంతో గందరగోళంకు గురువుతున్నారు. గ్యాస్ ఏజెన్సీనిర్వాహకులు ఆధార్‌కార్డుల మార్పు, ఈకేవైసీ చేసుకోవాలని సూచిస్తూ ఉండడంతో వినియోగదారులు వాటిని కూడా చేయిస్తున్నారు. ఈకేవైసీ పేరుతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రూ 200 వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ విషయమై భద్రాచలం హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ వెంకన్న సంప్రదించగా సాంకేతిక కారణంగా బదిలీ ప్రక్రియలో జాప్యం జరిగిందని, వినియోగదారులు గ్యాస్ బుక్, డాక్యుమెంట్, ఆధార్‌తో తమ వద్దకు వస్తే సమస్యను పరిష్కస్తామని చెప్పారు.

తలుపులమ్మ కరుణించమ్మ

- ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం


భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఒక్కరోజే భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.1.27లక్షల ఆదాయం సమకూరింది.

రాష్ట్రంలో తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ



రాజమహేంద్రవరంలో ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ రాజమహేంద్రవరంలోని సాయి హాస్పిటల్‌లో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కురుకూరి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరుదైన మోచిప్ప మార్పిడి సర్జరీ చేయడం దక్షిణ భారత దేశంలోనే ఇది మూడోవదన్నారు. బెంగుళూరులో ఒకటి, హైదారాబాద్‌లో ఒకటి మాత్రమే జరిగాయని, మూడోవది రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్‌లో చేశామన్నారు. మోచిప్ప అరుగుదలకు సంబంధించి చేసే సర్జరీని ఎపిసర్ఫ్ సర్జరీ అంటారన్నా రు. తమ ఆసుపత్రికలో.. అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ పేషంట్ మోచిప్పలో ఉన్న అరుగుదలను సరిచేసేందుకు ఇంప్లాట్లను పేషంట్‌కు తగ్గట్టుగా ఇంప్లాంట్ల తయారీ సంస్థలు డిజైన్ చేసి తయారు చేశాయన్నారు. స్వీడన్‌లో వాటిని తయారు చేశాయన్నారు. దానిని తమ ఆసుపత్రిలో తనతోపాటు మంగుళూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ దీపక్ రే, యశోదా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పూర్ణచంద్రతేజస్వి కలిసి గంట వ్యవధిలో సర్జరీ పూర్తిచేశామని విజయ్‌కుమార్ చెప్పారు.

కాకినాడ

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు జిల్లాకు పవన్‌కల్యాణ్



మారిన షెడ్యూల్

పర్యటన ఒకరోజుకే కుదింపు

పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆయన పర్యటనను ఒకరోజుకే కుదించారు. పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో సోమవారం పర్యటించి అదే రోజు సాయంత్రం తిరిగి పయనం కానున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం సాయంత్రం అధికారికంగా సమాచారం వచ్చింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన తొలుత ఈనెల 4,5వ తేదీల్లో ఉంటుందని ప్రకటించారు. అయితే 5వ తేదీ నాగులచవితి కావడంతో పర్యటనను ఒక్కరోజుకే పరిమితం చేశారు. మారిన షెడ్యూల్ ప్రకారం ఆయన 4న ఉదయం కాకినాడ జిల్లాకు వచ్చి కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం తిరిగి వెళ్లతారు.

నేడు పర్యటన ఇలా...

సోమవారం ఉదయం 8గంటలకు మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 8.40గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 9.30గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి 11.00గంటలకు గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. అక్కడ పిఠాపురం నియోజకవర్గంలోని పాఠశాలలకు మంజూరైన సైన్స్ ల్యాబ్‌లను, గొల్లప్రోలు పట్టణంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల-2 నూతన భవనాలను ప్రారంభిస్తారు. గొల్లప్రోలు జగనన్న కాలనీకి మంజూరైన బ్రిడ్జి నిర్మాణంతో పాటు సూరంపేటకు మంజూరైన బ్రిడ్జి నిర్మాణానికి, గొల్లప్రోలు బాలుర ఉన్నత పాఠశాల భవనాల మరమ్మతుల పనులకు, అసంపూర్తిగా ఉన్న గొల్లప్రోలు అర్బన్‌హెల్త్ సెంటర్, తహశీల్దారు కార్యాలయ పూర్తికి చేపట్టే పనులకు, గొల్లప్రోలులోని మొగలి సూర్యుడు మంచినీరు చెరువు ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. అక్కడ నుంచి 11.30గంటలకు బయలుదేరి 11.45గంటలకు పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం చేరుకుంటారు. అక్కడ నుంచే నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. టీటీడీ ఆధ్వర్యంలోని వేంకటేశ్వరస్వామి మాడవీధులు, కల్యాణమండపం మరమ్మతులకు, బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాల మరమ్మతులకు ఆయన శంఖుస్థాపన చేస్తారు. పశువుల సంత ఆధునీకరణ పనులకు శ్రీకారం చుడతారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.15గంటలకు బయలుదేరి 12.30గంటలకు కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలో ఏపీఎస్‌డబ్లూఆర్‌ఈఐ ఇనిస్టిట్యూట్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి 1.30గంటలకు కొత్తపల్లి పీహెచ్‌సీకి చేరుకుంటారు. పీహెచ్‌సీలో అవుట్ పేషెంట్‌బ్లాకు నిర్మాణానికి, ఇసుకపల్లి, రవీంద్రపురం, నిదానందొడ్డి, శొంటివారిపాకలులోని మండలపరిషత్ పాఠశాల భవనాల నిర్మాణానికి, మూలపేట హాస్టల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కొత్తపల్లి మండలంలో టీటీడీ కల్యాణమండపం నిర్మాణంపై పవన్ ప్రకటన చేయనున్నారు. అక్కడ నుంచి 2గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి సాయంత్రం 5గంటలకు చేరుకుని అక్కడ నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లతారు. పవన్ షెడ్యూల్ మారడంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

పిఠాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సోమవారం జరపనున్న పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ తెలిపారు. పవన్ పర్యటన జరిగే గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పిఠాపురంలోని టీటీడీ కల్యాణమండపాలను ఆయన జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాలతో కలిసి ఆదివారం పరిశీలించారు. అక్కడే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ జరగనున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లుపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాల్లో పర్యటించారు. వారి వెంట జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ రామకోటేశ్వరరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్లు రవికుమార్, కనకారావు, ఎంపీడీవో కర్రి స్వప్న తదితరులు ఉన్నారు. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను ఆదివారం రాత్రి కలెక్టర్ మరో మారు పరిశీలించారు. పవన్ రోడ్డుమార్గంలో వస్తున్నట్టు షెడ్యూల్‌లో వచ్చినా హెలిప్యాడ్ ను ప్రత్యామ్నాయంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఉన్నత పాఠశాల సమీపంలోని హెలిప్యాడ్ వద్ద తుప్పలు తొలగించి శుభ్రం చేసే పనులను నిర్వహించారు.

భారీ బందోబస్తు

పవన్ పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీ, తొమ్మిది మంది సీఐలు, 29మంది ఎస్‌ఐలు, 78మంది ఏఎస్‌ఐ, హెచ్‌సీలు, 155మంది పీసీలు, 18మంది మహిళా పోలీసులు, 50మందితో కూడిన 8 స్పెషల్‌పార్టీలను వినియోగించనున్నారు. మొత్తం 340మంది బందోబస్తులో ఉండనున్నారు.



గొల్లప్రోలులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టరు షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్ మీనా

పారిశుధ్య చర్యలు

సామర్లకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ సోమవారం పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఏడీబీ రోడ్డు మీదుగా సామర్లకోట మండలం పండ్రవాడ జంక్షన్, పవర గ్రామాల మీదుగా పర్యటించనున్నందున పండ్రవాడ, పవర గ్రామాల వద్ద రోడ్డు పొడవునా ప్రత్యేక పారిశుధ్య చర్యలను ఆదివారం 2 పంచాయతీల అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు. సామర్లకోట మండలంలోని జనసేన నాయకులు పవన్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు పవర, పండ్రవాడ జంక్షన్‌లకు చేరుకోనున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అపార్ కార్డుతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు

డీవైఈవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో

గొల్లప్రోలు రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 12 అంకెల జీవితకాల ప్రత్యేక గుర్తింపు కార్డు(అపార్ కార్డు)తో బహుళ ప్రయోజనాలు ఉన్నా యని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. గొల్లప్రోలులోని మం డల వనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అకడమిక్ పురోగతిని, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అపార్‌కార్డు ఉపయోగపడుతుందని చెప్పారు. మండలంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు 9,281మంది విద్యార్థులు ఉండగా, 3,780 మందికి అపార్‌కార్డుల జారీ పూర్తయిందని తెలిపారు. 15వ తేది నాటికి ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణకు ఆదేశం!

కాకినాడ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై కళాశాల విద్య కమిషనర్ ఆదేశాల మేరకు జోన్-2 ఆర్జేడీ సోమవారం విచారణ చేపట్టనున్నట్టు సమాచారం. కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయనపై పలు ఆరోపణలున్నాయి. కళాశాల స్నాతకోత్సవం కోసం హాజరైన అప్పటి కమిషనర్ పోలా భాస్కర్‌ను అవమానపరిచేరీతిలో ఏర్పాట్లు చేశారని ఆయనను కాకినాడ నుంచి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కమిషనర్ బదిలీచేశారు. అయితే అప్పట్లో ఆయన కోర్టుకు వెళ్లి తిరిగి ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. కళాశాల న్యాక్ గ్రేడు ఏ నుంచి బీ++ కు పడిపోయింది. కళాశాలలోని అధ్యాపకులకు, ప్రిన్సిపాల్‌కు మధ్య సమన్వయం కొరవడింది. ఇటీవల కళాశాలలోని ఓ అధ్యాపకుడు ప్రిన్సిపాల్‌పై కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆర్జేడీ విచారణకు వస్తున్నట్టు తెలిసింది.

దండపాణి గురుస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న శిల్పి రాజ్‌కుమార్ వడయార్, గోపాలకృష్ణ

పోర్టుసిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారణ గురువు దండపాణి గురుస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. భానుగుడి అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున అయ్యప్పస్వామి భక్తులు హాజరయ్యారు. అనంతరం శిల్పి రాజ్‌కుమార్ వడయార్‌ను అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో దేవాలయం నిర్వాహక బృందం సభ్యులు మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, రాయణం, ద్వారంపూడి భాస్కరరెడ్డి, నానాజీ, దేవాలయం పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ, వలు గురుస్వామి, పద్మనాభస్వామి ఉన్నారు.

ల్యాప్‌టాప్‌ల అందజేత

కాకినాడ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెడ్‌కాన్వెంట్ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఇంజనీరింగ్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు టి.శ్రీనివాసరాజు, ప్రసాద్, కళ్యాణి చేతులమీదుగా ల్యాప్‌టాప్‌లను డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసిన 7ఏళ్లలో రూ.70లక్షలకు పైగా ఖర్చుతో అనేక సేవాకార్యక్రమాలు చేశామన్నారు. జగన్నాధం, పద్మనాభం, మధు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే పంతం నానాజీ



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీలో వర్తించని వైద్య ఖర్చులను సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు చేసి నిరుపేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఆదివారం రాత్రి గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేసిన రూ.3,18,599 చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపు వెంకటరమణ, సింహాద్రి, సలాది శ్రీనివాస బాబు తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి 1గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ్యవస్థ కార్యక్రమం జరుగుతుందన్నారు.

హుస్సేన్‌పురంలో నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

సామర్లకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం హుస్సేన్‌పురం పంచాయతీ ఆవరణలో, గ్రామంలోనూ పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతులమీదుగా పెద్ద ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టనున్నట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు చల్లా బుజ్జి తెలిపారు. గ్రామ శివారున కొత్తపేటలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను రాజప్ప ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి వెంకటరమణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఆయన చెప్పారు.

15, 16, 17ల్లో సీపీఎం మహాసభలు

పెద్దాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ దారపు రెడ్డి క్రాంతికుమార్ కోరారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో మహాసభలకు సంబంధించి కరపత్రాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నీలపాల సూరిబాబు, శ్రీనివాస్, కృష్ణ, వీర్రాజు, శుభలక్ష్మీ, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ సందర్శన

కాకినాడ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ అశోక్‌నగరలోని ఎంఎస్ నారాయణ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలతో సైన్స్ ల్యాబ్‌ను ఆదివారం పలువురు విద్యార్థులు సందర్శించారు. సైన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఈ సైన్స్ ల్యాబ్‌ను కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఎస్ఎన్ విద్యాసంస్థల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ తెలిపారు. ల్యాబ్‌ను రామచంద్రపురం రేవతి సైన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె కృష్ణ సాయి, పెద్దాపురం యాక్ట్ సైన్స్ సెంటర్ అధినేత బుద్ధ శ్రీనివాస్‌లు ప్రారంభించారు. సైన్స్ షోను ప్రదర్శించారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమోద్, ప్రిన్సిపాల్ నాగిని, సంస్థ కోఆర్డినేటర్ వేణుగోపాల్ ఉన్నారు.



సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

డిప్యూటీ సీఎం గారూ....!

గ్రామ పంచాయతీల విలీనంపై సందిగ్ధత తొలగించాలి

కాకినాడ రూరల్ ప్రజల డిమాండ్



చీడిగ గ్రామ పంచాయతీ కార్యాలయం

సర్పవరం జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ స్మార్ట్ సిటీలో కాకినాడ రూరల్‌కు చెందిన 6 గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. 2013లో ఇది జరిగినా కొంతమంది కోర్టుకెళ్లడంతో ఏళ్ల తరబడి అటు విలీనం కాక, ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ ఆరు పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు మం జూరు కాక అభివృద్ధి కుంటుపడింది. డిప్యూటీ సీఎం హోదాలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా, సోమవారం పిఠాపురం నియోజకవర్గానికి వస్తు న్న పవన్ గ్రామాల విలీనంపై ఉన్న సందిగ్ధతను తొలగించాలని ప్రజలుముక్తకంఠంతో కోరుతున్నారు.

కాకినాడ రూరల్ మండలంలో 20 గ్రామాలు ఉన్నాయి. ఇందులో రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి, కొవ్వూరు, సర్పవరం, తిమ్మాపురం, పి.వెంకటాపురం, పండూరు, నేమాం, తమ్మవరం, పెనుమర్తి, సూర్యారావుపేట పంచాయతీలకు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తోంది. కాకినాడ కార్పొరేషన్ స్మార్ట్ సిటీగా ఎంపికవ్వడంతో కాకినాడ రూరల్ పరిధిలోని రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి, స్వామినగర్, ఎస్.అచ్చుతాపురం గ్రామాలను 2013లో కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. విలీనానికి అనుకూలంగా స్వామినగర్, ఎస్.అచ్చుతాపురం గ్రామాలు తీర్మానం ఇవ్వడంతో గంగనాపల్లి శివారు టీచర్స్ కాలనీని 42వ డివిజన్‌గా, ఎస్.అచ్చుతాపురాన్ని 48వ డివిజన్‌గా కార్పొరేషన్‌లో విలీనం చేశారు. చీడిగ, ఇంద్రపాలెం, తూరంగి, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల గ్రామాలకు చెందిన కొందరు విలీనాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లగా, స్టే ఇవ్వడం కార్పొరేషన్ కౌంటర్ వేయడం జరిగింది. ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతోంది. ఇంటి పన్నుల నుంచి లభించే ఆదాయం శానిటేషన్ వర్కర్ల జీతభత్యాలు, బ్లీచింగ్, తాగునీటి నిర్వహణకే చాలకపోవడంతో అభివృద్ధి పడకేసింది. విద్యుద్దీపాలు నిర్వహణ, డ్రైనేజీల మరమ్మతులకు నిధుల్లేక విలీన పంచాయతీల్లో పరిస్థితి కడు దయనీయంగా మారింది. విలీనంపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకుని వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారని ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే ద్వారా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి విలీన గ్రామాల భవితవ్యంపై ఒక నిర్ణయం తీసుకునేలా సహకరించాలని కోరారు.

కుంటుపడిన అభివృద్ధి



అరు పంచాయతీలకు 2013 నుంచి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల నేతృత్వంలో పాలన సాగుతోంది. ఇంటి పన్నులతో పాటు సాధారణ ఆదాయం తప్పించి కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలు, శానిటేషన్, తాగునీటి నిర్వహణకు మాత్రమే సరిపోతోంది. నిధులు లేక మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. జనసేనకు చెందిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విలీన గ్రామాల సమస్యను డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకెళ్లాలి.

అడబాల రత్నప్రసాదరావు, మాజీ సర్పంచ్

భీమేశ్వరాలయంలో విశేష పూజలు



విశేష అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మహాపర్వదినాలు రెండవరోజు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య భీమేశ్వరస్వామికి విశేష అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామివారిని,అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపపూజలను పండితులు చెరుకూరి రాంబాబు తదితర పండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక దీపారాధన సంఘ సభ్యులతో ఆలయ ఆవర ణలో జ్యోతి ర్లింగార్చన పూజలు, దీపాల అలంకరణలతో ఆలయ ఆవరణ దేదీప్య మానంగా ప్రకాశించింది. సుమారు 1500మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.



ఆలయ ఆవరణలో జ్యోతిర్లింగార్చన పూజలు

గురుకులం పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



విద్యార్థుల డైనింగ్ హాల్‌ని పరిశీలించి ఆహారాన్ని రుచి చూస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

సర్పవరం జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన పురస్కరించుకుని ఆదివారం కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం సాంఘిక సంక్షేమశాఖ బాలయోగి బాలికల గురుకులం పాఠశాలను జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై ప్రిన్సిపాల్ సుశీలను అడిగి తెలుసుకున్నారు. వంట ఆహారం తయారీ గదిని పరిశీలించి ఆహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం రుచికరంగా ఉందని వంటలు చక్కగా తయారు చేశారని నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. పవన్ కల్యాణ్ సోమవారం మధ్యాహ్నం ఇక్కడకు వస్తున్నారని, ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న అనంతరం వారితో సహపంక్తి భోజనం చేస్తారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ రాహుల్ మీనా, ఆర్డీవో ఎస్ మల్లిబాబు, డీఈవో రమేష్, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు, ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం!

పిచ్చిమొక్కలతో నిండిపోతున్న మురుగుకాలువలు

దోమల దాడితో హడలెత్తిపోతున్న ప్రజలు

కొత్తపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పారి శుధ్య లోపాలతో మండలంలో పలు గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. మురుగుకాలువలు పిచ్చితుప్పలతో పూడుకుపోతున్నాయి. మురు గునీరు ప్రవహించేందుకు ఆయా వీధుల్లో మురు గుకాలువల్లో పేరుకుపోయిన చెత్తతో పాటు, పిచ్చితుప్పలు కూడా పెరగడం ప్రధానం కారణం. కాలువల్లో చెత్త, పూడికను సరిగా తొలగించ కపోవడంతో మురుగు కాలువలు దోమల ఉత్ప త్తి కేంద్రాలుగా తయారయ్యాయి. నాగులాపల్లి ప ల్లపు వీధిలో మురుగు కాలువ అస్తవ్యస్తంగా ఉం డడంతో పాటు పిచ్చితుప్పలు ఏపుగా పెరగడం వల్ల మురుగునీరు పోయేందుకు దారిలేక అక్కడే ఉండిపోతుంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోతు న్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నాగులాపల్లి, శ్రీరాంపురం గ్రామాల్లో ఇద్దరికి డెంగ్యూ వ్యాధి సోకడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. గ్రామాల్లోని వీధు ల్లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, దోమలని వారణకు మందు ద్రావణాన్ని పిచికారీ చేయించాలని వారు కోరుతున్నారు.



నాగులాపల్లి పల్లపు వీధిలో మురుగుకాలువ దుస్థితి



మురుగుకాలువలో పెరిగిన పిచ్చితుప్పలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పాదగయలో భక్తుల రద్దీ

దర్శనానికి బారులు

పిఠాపురం, నవంబరు 3: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తుల తాకిడి అధికంగా ఉంది. కార్తీకమాసం, ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు ఎక్కువగా తరలివచ్చారు. శైవ క్షేత్రాల సందర్శనలో భాగంగా పాదగయకు వచ్చిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దర్శనానికి భక్తులు బారులు తీరారు. పలువురు భక్తులు శివ మాల ధరించారు. ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA

DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA

BOOK ONLINE TICKETS Paytm

NOW SHOWING



SINGHAM AGAIN (HINDI)
11-20AM, 2-20PM, 6-20PM, 9-40PM
LUCKY BASKHAR
11-15AM, 2-15PM, 6-15PM, 9-15PM
BAGHEERA : 11-30AM, 6-30PM
KA 2024 : 2-30PM, 9-30PM
AMARAN
11-45AM, 2-45PM, 6-45PM, 9-45PM

AMARAN :
11-40AM, 2-40PM, 6-40PM, 9-40PM
LUCKY BASKAHAR :
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM
BHOOL BHULAIYAA-3
11-20AM, 2-20PM, 6-20PM, 9-20PM
VENOM
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం దేవదాయ ధర్మాదాయ శాఖ
జగన్నాధపురం, కాకినాడ-2, కాకినాడ జిల్లా
టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

ప్రవస నెం.	వివరము	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము
1	దేవస్థానం నందు భక్తులచే సమర్పించబడు కొబ్బరి చెక్కలలో సగ భాగం పోగు చేసుకొను హక్కు	[illegible]	50,000/-

కాకినాడ 1-11-2024 కార్యనిర్వహణాధికారి

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తూరంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ తూరంగేశ్వరస్వామి వారి దేవస్థానం నందు భక్తులు సమర్పించు కొబ్బరికాయలో సగభాగం చెక్కలు ఒక సంవత్సరం కాలపరిమితికి తీసుకునిపోవు హక్కునకుగాను ది.14-11-2024 (గురువారం) ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారి దేవస్థానము వద్ద శ్రీ తనిఖీదారు, దేవాదాయశాఖ, కాకినాడ వారి సమక్షములో బహిరంగ వేలము జరుగును.

బహిరంగ వేలం షెడ్యూలు :

క్ర. నెం.	వివరము	ధరావత్తు	కాలపరిమితి
1.	భక్తులు సమర్పించు కొబ్బరి చెక్కలు అనుభవించు హక్కు	రూ. 20,000/-	ఒక సంవత్సరం

1) ఏ కారణం తెలుపకయే బహిరంగ వేలం నిలుపుదల చేయుటకుగానీ, వాయిదా వేయుటకు గానీ, రద్దు చేయుటకు గానీ దేవాదాయశాఖ అధికారులకు పూర్తి అధికారము కలదు.
2) వేలం షరతులు కార్యాలయపు పనిచేయు సమయంలో తెలుసుకొనవచ్చును. ఫోన్ : 9010894345
3) లైసెన్స్ కాలపరిమితిని పెంచుటకుగానీ, తగ్గించుటకుగానీ దేవస్థానం వారికి అధికారం కలదు.

తూరంగి (కాకినాడ రూరల్) ది.31-10-2024 కార్యనిర్వహణాధికారి

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రోడ్లను, కల్వర్టులను పరిశీలించిన అధికారులు



దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలిస్తున్న రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బృందం

మోతుగూడెం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి పరిధిలో పొలగెడ్డ నుంచి చింతపల్లి మండలం ఆర్‌వీనగర్ వరకు గల రాష్ట్ర ప్రధాన రహదారి గడిచిన పదేళ్లుగా పూర్తిగా ధ్వంసమై ప్రయాణికుల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి, వాగుల ఉధృతికి బ్రిడ్జిలు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజారవాణా పూర్తిగా స్తంభించడంతో సంబంధిత ఆర్‌అండ్‌బీ యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులుచేసి రహదారిని రాకపోకలకు పునరుద్ధరించారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు రహదారులపై దృష్టి సారించడంతో సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లల ఇవ్వాలని ఆదేశించడంతో రాష్ట్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్,ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస రెడ్డి బృందం రోడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలనే ఉద్దేశ్యంతో విశాఖపట్నం నుంచి చింతపల్లి సీలేరు మీదుగా రోడ్డుని పరిశీలించుకుంటూ వచ్చారు. ఎంపీటీసీ కరకా వెంకటరమణ మర్యాదపూర్వకంగా సీలేరులో కలిసే వర్షాల వలన జరిగిన నష్టాన్ని వివరించి పొలగెడ్డనుంచి ఆర్‌వీ నగర్ రోడ్ దుస్థితిని , పొలగెడ్డ నుంచి చింతూరు వరకుగల రోడ్లపై ఏర్పడిన గుంతలు, ఇరువైపులా దట్టంగా పెరిగిన జంగిల్ విషయమై వివరించి త్వరితగతిన రోడ్ల మరమ్మతులు చేయించి ప్రజలకు మెరుగైన రహదారి కల్పించాలని కోరారు. శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ సీఎం చంద్రబాబు ఏజెన్సీ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించి, నిధులు మంజూరుచేశారని, సదరు పనుల టెండర్లు పూర్తిచేసి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పాడేరు ఈఈ బాలసుందరబాబు, డీఈ చింతపల్లి రామారావు, రంపచోడవరం డీఈ సాయి సతీష్, ఆర్‌అండ్‌బీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కారే శ్రీనివాస్, బాల, అప్పారావు పాల్గొన్నారు..

పర్యాటకుల తాకిడి లేక

వెలవెలబోతున్న పొల్లూరు జలపాతం

మోతుగూడెం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండ లం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతానికి సు మారు 50 రోజుల నుంచి అటవీశాఖ అధికారులు పర్యాటకులను అనుమతించడంలేదు. దూరప్రాంతాల నుంచి ప్రతినిత్యం వస్తున్న పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మారేడుమిల్లి జలతరంగిణిలో ట్రైనీ డాక్టర్ వాగులో కొట్టుకుపోయాడు. మృతదేహం లభ్యం కాలేదు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ జలపాతాలకు అనుమతి లేదని ఫారెస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి జలపాతాలు మూసివేశారు. ప్రస్తుతం కార్తీకమాసం ప్రారంభం కావడం, నవంబరు మొదటివారం నుంచి ఏజెన్సీ ప్రాంతాలలో మంచు విపరీతంగా కురవడం ప్రారంభమవుతుంది. దీంతో చుట్టుప్రక్కల వాతావరణం మొత్తం మంచుతో కప్పబడి చూపరులను ఆకట్టుకునేవిధంగా మంచు కురవడంతో పచ్చదనం చిగురులు తొడుగుతుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల తాకిడి ఎక్కువవుతుంది. జలపాతాలు అనుమతి నిరాకరించడంతో పర్యాటకుల ఆశలపై నీళ్లు జల్లినట్లయ్యింది. నిరాశతో వెనుతిరిగిపోతున్నారు. చుట్టు ప్రక్కల ఉన్న చిరువ్యాపారస్తులు కూడా వ్యాపారం లేక విలవిల్లాడుతున్నారు.



పొల్లూరు ఎంట్రన్స్ గేట్ దగ్గర ఫారెస్ట్ అధికారులు పర్యాటకులను నిలిపివేస్తున్న దృశ్యం

కలువ పువ్వులకు భలే గిరాకీ

● విక్రయిస్తున్న చిన్నారులు

మోతుగూడెం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం మోతు గూడెం సంతమార్కెట్‌లో ఒరిస్సా కలువపువ్వులు కళకళ్లాడుతున్నాయి. కార్తీకమాసంలో కలువపువ్వులకు భలే గిరాకీ ఉంటుంది. చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఒడిశా సరిహద్దు రాష్ట్రం దప్పును కొండ గ్రామం నుంచి చిన్నారులు కళాపువ్వులు తీసుకుని వచ్చి సీలేరునదిపై పడవపై మోతుగూడెం చేరుకుని ఆదివారం సంతరోజు పువ్వులను అమ్ముతారు. పెద్దలు కార్తీకమాసం అయ్యే వరకు ఒరిస్సా రాష్ట్రం నుంచి కలువపువ్వులు తీసుకువచ్చి విక్రయిస్తారు.



విక్రయానికి సిద్ధం ఉన్న కలువ పువ్వులు

ఎంపీపీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం



శ్రీరామగిరి గ్రామంలో విద్యుత్ మోటారును ప్రారంభిస్తున్న ఎంపీపీ

వీఆర్‌పురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ ఎంపీపీ నిధులతో మండలంలోని శ్రీరామగిరి పంచాయ తీలో అభివృద్ధి పనులకు ఎంపీపీ కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. శ్రీరామగిరి గ్రామంలో మంచినీటి సరపరా కోసం విద్యుత్ మోటారును, చొక్కనపల్లి గిరిజన గ్రామంలో దాహార్తిని తీర్చేందుకు చేతిపంపును ఏర్పాటుచేశారు. గుండిపూడి లక్ష్మణరావు, తోడంరాజు, శీరపు తాతబాబు, కాంతారావు, నాళ్ళారపు సత్యనారాయణ, నాగేశ్వరరావు, సోడి శ్రీను, చందర్‌రావు పాల్గొన్నారు.

'గండిపోశమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా'

దేవీపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యునిగా నియమితులైన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆదివారం గండిపోశమ్మ ఆలయ కార్యనిర్వాహణాధికారి గండి వెంకటలక్ష్మీకుమార్, నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గురైన పోశమ్మగండి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నెహ్రూను కోరగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నెహ్రూకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రోడ్డుపైనే సంత... ప్రజలకు చింత!

జాతీయ రహదారి పక్కనే దుకాణాలు

తర్జనభర్జన పడుతున్న కొనుగోలుదారులు

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామంలో ప్రతీ మంగళవారం వారపు సంత నిర్వహిస్తారు. అయితే దుకాణాలు జాతీయ రహదారి పక్కనే వేయడంతో కొనుగోలుదారులు రహదారిపైనే వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. మార్కెట్ సమయంలో ఆప్రాంతమంతా రద్దీగా ఉంటుంది. డివైడర్ దాటే సమయంలో కొనుగోలుదారులు తర్జనభర్జన పడుతున్నారు. మార్కెట్ ఆక్రమణకు గురవడంతో చోటు లేక జాతీయ రహదారిపై నిర్వహిస్తున్నారు. అసలే హైవే కావడంతో వాహనాలు వేగంగా వెళ్తున్నందున ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లేపల్లి జాతీయ రహదారిపై వ్యాపార దుకాణాలు

తృటిలో తప్పిన ప్రమాదం



బొర్రంపాలెంలో రహదారిపై కారు, లారీ

గండేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో బొర్రంపాలెం గ్రామశివారులో ఆదివారం తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. తెలంగాణకు చెందిన భార్యాభర్తలు కారులో అన్నవరం వెళ్లి తిరిగి వస్తుండగా ముందువెళ్తున్న కంటైనర్ లారీను సైడ్ వేస్తున్న సమయంలో లారీ కారును ఢీకొంది. కారు స్వల్పంగా డ్యామేజ్ అయినప్పటికీ లోపల ఉన్నవారికి ఏ గాయాలు కాలేదు.

అలరించిన శ్రీకృష్ణ రాయభారం ప్రదర్శన



ధర్మవరంలో కళాప్రదర్శన దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయభారం అలరించింది. మహాభారత యుద్ధ ఘట్టానికి సంబంధించి ముందుగా శ్రీకృష్ణుడు గౌరవ పాండవుల మధ్య సయోధ్య కోసం జరిపే రాయభార సన్నివేశాన్ని ప్రదర్శించి ప్రే క్షకులను ఆకట్టుకున్నారు. శ్రీ కృష్ణుడిగా జాబు శ్రీనివాస్, ద్రౌపతిగా పలవెల పరమేష్, ధర్మరాజుగా కాశి సూర్యచంద్రరావు, భీముడిగా మొండి సుభాష్, అర్జునుడిగా పేలి సూరిబాబు, సహదేవుడిగా ఎం. నాగు, లకునుడిగా మాదాపు నాని నటించారు.

పేకాట శిబిరంపై దాడులు

తొమ్మిదిమంది అరెస్ట్

తుని రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కె.వో.మల్లవరంలో ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై తుని రూరల్ పోలీసులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. 9 మంది వ్యక్తులు పట్టుపడగా, రూ.19,420 నగదు, టేబుల్, కుర్చీలు ఇతర సామాగ్రిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు.

'వారికి రూ.15వేలు పింఛను ఇవ్వాలి'

కిర్లంపూడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైనవారికి రూ.15వేలు పింఛన్ ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అది నెరవేర్చలేదని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. మండలంలోని సింహాద్రిపురంలో పీతల సత్యనారాయణను పరామర్శించిన ఆయన ఈ విషయంపై మాట్లాడారు. ప్రభుత్వం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారులతో సర్వే చేయించి మంచానికే పరిమితమైన వారిని గుర్తించి రూ.15వేలు పింఛన్ ఇప్పించేలా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజల కన్నీళ్లు తుడిచిన తెలుగుదేశం పార్టీ

తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కట్టె పొయ్యల కష్టాలు తీర్చి వారి కన్నీళ్ల తుడిచిన ఘనత తెలుగుదేశం పార్టీ దైతే దానిని తిరిగి కొనసాగిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఆదివారం ఏ.కొత్తపల్లిలో జరిగిన ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పొగతో అనారోగ్యం పాలవుతున్న గ్రామీణ మహిళలకు వాటిని దూరం చేసి ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందించేందుకు దీపం పథకం ప్రవేశపెట్టారన్నారు. ఆర్థికంగా పెనుభారంగా మారిన సిలెండర్ల ధరను భరించలేక అవస్థలు పడుతున్న మహిళలకు అండగా ఉండేం దుకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కొయ్యా రామకేశవ, టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు యువత మండలాధ్యక్షులు బంటుపల్లి అన్వేష్, కోడ వెంకటరమణ, గ్యాస్ ఏజెన్సీ అధి నేత వడ్డాది ప్రసాద్, అరిగెల నర్సింహమూర్తి, వనపర్తి రాజా, చిట్టిబాబు, నేమాల గోవిందు, సంగిశెట్టి రమేష్ పాల్గొన్నారు.



ఏ.కొత్తపల్లిలో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కాశీ విశ్వనాథ్, ప్రకాష్‌రావు

జగ్గంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా ప్రభుత్వం ఇటీవల నియమించడంతో జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ముమ్మిడివరపు కాశి మనవడు అయిన అనకాపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్న ముమ్మిడివరపు కాశీ విశ్వనాథ్, సోదరుడు ఎలక్ట్రికల్ ఏఈ ముమ్మిడివరపు ప్రకాష్‌రావుతో కలిసి ఆదివారం నెహ్రూను కలిసి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక అందించారు. జ్యోతుల నవీన్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు దాట్ల రమేష్‌రాజు, రామవరం పంచాయతీ వార్డు సభ్యులు మండపాక వెంకటేశ్వరరావు, బోధ శివకుమార్ తదితరులు ఉన్నారు.

గోదావరి హారతికి ఆహ్వానం

తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు గోదావరి హారతికి జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను ప్రాజెక్టు నిర్వహణ అధికారి పగడాల ఆనంద తీర్థచార్య ఆహ్వానించారు. ముందుగా నవీన్‌ను తిరుమల వేంకటేశ్వరస్వామి వారి శేషవస్త్రంతో అలంకరించి తిరుమల శ్రీవారి లడ్డూ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 4న కార్తీక సోమవారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7.30గంటలకు కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి హారతి నిర్వహిస్తున్నామని నెహ్రూ, నవీన్‌లను ఆహ్వానించడానికి వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో బుర్రి సత్తిబాబు, తోలేటి సూర్యనారాయణ, గద్దె మారుతి, పుర్రె సూరన్న, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతినిధులు ఎస్.వెంకటేష్, పి.త్రిమూర్తులు, ఎన్‌వీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గంపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు చిన్న పులిరాజు ఆరోగ్యం బాగోకపోవడంతో ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అన్నవరంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



చిన్నారులను అభినందిస్తున్న ఈవో

అన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అన్నవరం దేవస్థానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన కళాకారులు చేపట్టిన చిన్నారుల నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ప్రదర్శన అనంతరం చిన్నారులను ఈవో రామచంద్రమోహన్ అభినందించారు.

ఇలా నరికేస్తే ఎలా?

రౌతులపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకంలో భాగంగా గుమ్మరేగుల గ్రామం నుంచి ఎస్.పైడిపాల వరకూ రహదారి పొడవునా మొక్కలు నాటారు. అవి వేపుగా పెరిగాయి. అయితే విద్యుత్ వైర్లకు అడ్డం వస్తున్నాయంటూ వాటిని నరికివేస్తున్నారు. మొక్కలు వేసేటప్పుడు విద్యుత్ వైర్ల కిందవేస్తున్నారు అవి పెరిగాక విద్యుత్‌శాఖాధికారులు వైర్లకు అడ్డం వస్తున్నాయని నరికివేయడంతో ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైర్ల కింద మొక్కలు వేస్తున్నారని ఆ సమయంలో తెలియదా అంటూ ప్రశ్నిస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి మొక్కలు వేయడం ఎందుకు? నరికివేయడం ఎందుకు ప్రశ్నిస్తున్నారు. మొక్కలు వేసేటప్పుడు వైర్ల కిందవేయవద్దంటూ ప్రజలు కోరుతున్నారు.



గుమ్మరేగుల- ఎస్.పైడిపాల రహదారిలో విద్యుత్ వైర్ల కింద నరికివేసిన మొక్కలు

పట్టపగలూ వెలుగులే!



గుమ్మరేగుల్లో వెలుగుతున్న వీధిలైట్లు

రౌతులపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చాలా గ్రామాల్లో వీధిలైట్లు వెలగక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. కానీ రౌతులపూడి మండలంలోని గుమ్మరేగుల్లో మాత్రం పట్టపగలూ కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయి. ఒక్కలైటు అయితే పర్వాలేదు జంట లైట్లు కాంతులు విరజిమ్ముతున్నాయి. పంచాయితీ అధికారులు స్పందించి పగలు లైట్లు వెలగకుండా విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు



గోకవరంలో అరటి తోటను నరికివేసిన దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామంలోని అరటి తోటలో 300 అరటి మొక్కలు, 50 కొబ్బరి మొక్కలను వేములపాలెనికి చెందిన కొందరు ఆదివారం నిర్దాక్షిణ్యంగా నరికివేశారని ఆ తోట యజమాని సత్తి వినోద్‌కుమార్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ అరటితోటలోని అంతర్ మొక్కలుగా వేసిన 50 కొబ్బరి మొక్కలను కూడా ఐదుగురు దుండగులు కత్తులతో ధ్వంసం చేశారని, దీనిపై పోలీసులు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరాడు.

మురారిలో కనకదుర్గమ్మ ఆలయం కిటకిట



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

గండేపల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామ శివారున వెలసిన కనకదుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం కావడంతో జిల్లా వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ జాగ్రత్తలు తీసుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రత్తిపాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలో పొదల మాటున ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 35 ఏళ్ల మహిళ అనుమానాస్పద మృతి చెందడంతో సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు వివరాలు, ఆచూకీ తెలియాల్సి ఉంది. స్థానిక వీఆర్వో మల్లికాసులమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందినషేక్ నాగూర్ పక్షపాతం వల్ల గోకవరం గవర్నమెంట్ హాస్పటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. ఆదివారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌ను కోరారు. గవిని దుర్గాప్రసాద్, పదిలం మురళి, దోసపాటి సుబ్బారావు, చల్లపల్లి దుర్గాప్రసాద్, సుంకర శివ, గాజిగంనాని, శివరామకృష్ణ, జీవి నాయుడు, శివ, సురపరెడ్డి నరేష్, పాలెం బాబి ఉన్నారు.

అధ్వానంగా రమణయ్యపేట-జె.అన్నవరం రహదారి

● ఇబ్బందులు పడుతున్న గిరిజన ప్రాంతవాసులు

రాజవొమ్మంగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీలోని వై.రామవరం,అడ్డతీగల,రాజవొమ్మంగి మండలాలకు వచ్చేందుకు ప్రధాన రహదారి అయిన ఏలేశ్వరం-జె.అన్నవరం రహదారి అధ్వానంగా ఉండడంతో గత ఐదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జడ్డంగి అన్నవరం వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రహదారి నిర్మాణానికి 2020వ సంవత్సరంలో గత ప్రభుత్వం 22కోట్ల47లక్షలు మంజూరు చేసింది. వెంటనే టెండర్ ప్రక్రియ కూడ పూర్తైంది.కాని చాలా ఏళ్లు కాంట్రక్టర్ పనులు చేయకపోవడం, ప్రభుత్వం మారడంతో ఆ నిధులు పూర్తిగా రద్దయాయి. ఆ రహదారిపై భారి వాహనాలు తిరగడం, రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు కనుమరుగైంది. కొన్ని చోట్ల గోతులు తప్ప రోడ్డు కనిపించక పోగా , మరికొన్ని చోట్ల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి మట్టి మాత్రమే ఉంది. ఈ రహదారిలో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక ఆటోలు గోతులలో పడి ఎదరభాగం ఊడిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కొద్దిపాటి వర్షానికే రోడ్డు చెరువును తలపిస్తుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏలేశ్వరం మండలంలోని రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వరకు అధ్వానంగా ఉన్న రహదారి మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరు చేసింది. దీనిపై ప్రజలు సామాజిక మాధ్యమాల్లో మరమ్మతులు చేసేందుకు రోడ్డు ఎక్కడా అంటూ ప్రశ్నిస్తున్నారు.



గోతులమయమైన రమణయ్యపేట-జె.అన్నవరం రహదారి

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



SINGHAM AGAIN (HINDI)
11-20AM, 2-20PM, 6-20PM, 9-40PM
LUCKY BASKHAR
11-15AM, 2-15PM, 6-15PM, 9-15PM
BAGHEERA : 11-30AM, 6-30PM
KA 2024 : 2-30PM, 9-30PM
AMARAN
11-45AM, 2-45PM, 6-45PM, 9-45PM

AMARAN :
11-40AM, 2-40PM, 6-40PM, 9-40PM
LUCKY BASKAHAR :
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM
BHOOL BHULAIYAA-3
11-20AM, 2-20PM, 6-20PM, 9-20PM
VENOM
11-30AM, 2-30PM, 6-30PM, 9-30PM